

టిటిడి నూతన ఈఓను కలిసిన కమిషనర్ మౌర్య




ప్రజాశక్తి - తిరుపతి టౌన్: టిటిడి నూతన ఈఓ అనిల్ కుమార్ సింఘాల్‌ని గురువారం కమిషనర్ మౌర్య మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 24వ తేదీ నుంచి జరగనున్న సందర్భంగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగుపరిచేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు. తిరుపతికి వచ్చే యాత్రికులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఈవో అనిల్ కుమార్ సింఘాల్ కమిషనర్‌కు సూచించారు.

నిప్పు.. కార్మికుల ప్రాణాలకు ముప్పు

మునోత్ (లిథియం బ్యాటరీ) పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమా..?
- నైట్ షిఫ్ట్ లేకపోవడంతో తప్పిన ప్రాణ నష్టం
- పరిశ్రమ సంపద అగ్నికి ఆహుతి
- దట్టమైన పొగతో విమాన రాకపోకలకు అంతరాయం





ప్రజాశక్తి-ఏర్పేడు : ఏర్పేడు మండలం, వికృతమాల పరిసరాల్లో ఇఎంసి 2 వద్ద మునోత్ ఇండస్ట్రీ (లిథియం సెల్ మ్యానుఫ్యాక్చరింగ్)లో గురువారం తెల్లవారుజామున 3.30గం సమయంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మొబైల్ పవర్ బ్యాంక్స్, స్మార్ట్ ఫోన్ బ్యాటరీస్, ల్యాప్‌టాప్, మెడికల్ డివైసెస్‌లో ఉపయోగించే లిథియం పాలిమర్ సెల్స్ వంటివి ఈ పరిశ్రమలో తయారు చేస్తారు. ప్రొడక్షన్ లేనందున బుధవారం రాత్రి షిఫ్ట్ సెలవు ఇవ్వడంతో ప్రాణ నష్టం తప్పింది. రసాయనాలు, కెమికల్స్, బ్యాటరీస్ ఎక్కువగా ఉండడంతో మంటలు చెలరేగి పరిసర ప్రాంతం దట్టమైన పొగ అలముకోవడంతో సమీపంలోనున్న విమానాశ్రయానికి విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఫైర్ అధికారి అసిస్టెంట్ డివిజన్ కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా పరిశ్రమ లిథియం సెల్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ కావడంతో ఎక్కువగా కెమికల్స్, కెబుల్స్, బ్యాటరీస్ ఉండడం వలన మంటలు చెలరేగాయని, మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకు రావడానికి 1.30 గంట సమయం పట్టిందని తెలిపారు. తిరుపతి, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాయుడుపేట, పాకాల, వెంకటగిరి, రైల్వే కోడూర్, చిత్తూరు, డిక్సన్ కంపెనీ నుండి 10 ఫైర్ ఇంజన్లతో మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువడం జరిగిందన్నారు. మంటలను అదుపులోకి తీసుకురావడానికి వీలుగా 6 జెసిబి లతో గోడలను తొలగించామన్నారు. పరిశ్రమ యాజమాన్యం ప్రొడక్షన్ లేకపోవడంతో నైట్ షిఫ్ట్ సెలవు ఇవ్వడం జరిగిందని తెలిపారని, ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని, భారీ మొత్తంలో ఆస్తి నష్టం జరిగిందని, ఫోరెన్సిక్ అధికారులకు తెలియపరిచామని త్వరలో ఎఫ్ఎస్ఎల్ రిపోర్టును ఇస్తామని తెలిపారు. ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డిని వివరాలు కోరగా పరిశ్రమ యాజమాన్యం సమాచారంతో పోలీస్ బృందంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నామని, ప్రాణ నష్టం జరగలేదని, ఆస్తి నష్టం ఏర్పడిందన్నారు. లోపల సామాగ్రి పూర్తిగా కాలిపోవడంతో ఫోరెన్సిక్ అధికారులు లోనికి వెళ్లలేకున్నామన్నారు. పరిశ్రమ యాజమాన్యం వివరాలు మేరకు షార్ట్ సర్క్యూట్ ఏర్పడిందని తెలిపారు. కేసు నమోదు చేయడం జరిగిందని, ప్రమాద కారణాలను దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఏర్పేడు ఎమ్మార్వో భార్గవిని వివరాలు కోరగా, ప్రమాద విషయం తమకు ఆలస్యంగా తెలిసిందన్నారు. ఆర్డీవో భాను ప్రకాష్, ఎంపీడీవో సౌభాగ్యమ్మ, ఆర్ఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారని, పరిశ్రమ యాజమాన్యం వివరాలు కేవలం ఇద్దరు సెక్యూరిటీస్, ఇద్దరు ఆపరేటర్లు మాత్రమే ఉన్నారని తెలిపారన్నారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని, భారీ మొత్తంలో ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. మునోత్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ లో జరిగిన ప్రమాదాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ కంపెనీకి వెళ్లి సందర్శించారు. అక్కడ ఎటువంటి ప్రాణ నష్టము సంభవించలేదని, ఎవరూ గాయాల పాలు కాలేదని ఆయన తెలిపారు. పాపా నాయుడు పేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్య అధికారి డాక్టర్ ఎం నాగరాజు, సిబ్బంది కూడా సందర్శించారు. ప్రమాదంలో కార్మికులు ఎవరు లేని కారణంగా ప్రాణనష్టం జరగలేదు. సిఐటియు నాయకులు కర్మాగారాన్ని పరిశీలించి దాదాపు 85 కోట్ల వరకు నష్టం జరుగుతుందన్నారు. ఈ మధ్యకాలంలో అన్ని కర్మాగారాల్లో అగ్ని ప్రమాదాలు లేదా కార్మికుల ఆందోళనలు, పారిశ్రామికవేత్తలు కార్మికులను వేధించడం ఇలాంటి కార్యక్రమాలు తరచూ జరుగుతున్నాయి. ఇంత పెద్ద నష్టాన్ని కలిగించిన ఈ అగ్ని ప్రమాదం నిజంగా అగ్ని ప్రమాదమేనా? లేదా ఏదైనా ఆంతర్యం ఉందా అన్న విషయాన్ని అధికారులు తేల్చాలని సిఐటియు డిమాండ్ చేసిందన్నారు. ఇలా ఉన్న అన్ని కర్మాగారాలు ఏదో ఒక సాకు చెప్పి మూసేస్తుంటే కార్మికుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఏరియా కార్యదర్శి రాంబాబు, రైతు సంఘం నాయకులు రంగయ్య, సిఐటియు నాయకులు కరీముల్లా, వెంకటాద్రి పాల్గొన్నారు.



ప్రమాదం జరిగిన కంపెనీ పరిసరాలను పరిశీలిస్తున్న సిఐటియు నాయకులు

మేనకూరు సెజ్.. అరబిందో కంపెనీలో..

- భారీ ప్రమాదం సంభవించిన మీడియాని కంపెనీలోకి అనుమతించని యాజమాన్యం
- అరబిందో కంపెనీలో ప్రమాదానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమా ?
- ప్రమాదంపై అగ్నిమాపక అధికారుల నిర్లక్ష్య వైఖరి






ప్రజాశక్తి - నాయుడుపేట: వందలాదిమంది కార్మికులు పనిచేస్తున్న కర్మాగారం, చుట్టూ పదుల సంఖ్యలో కంపెనీలు వేలాది కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న వందలకోట్ల విలువ చేసే కంపెనీలు ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన ప్రాణాలు పోయే పరిస్థితి. తిరుపతి జిల్లా నాయుడుపేట మండలంలోని మేనకూరు సెజ్ లో ఎన్నో కంపెనీలు ఉన్నాయి. వాటిలో కొన్ని కంపెనీల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కార్మికుల ప్రాణాలతో చెలగాటలు ఆడుతున్నారు. అధికారులు దృష్టి పెట్టకపోవడంతో కొన్ని యాజమాన్యాలు బాధ్యతా రాహిత్యంగా నడుచుకుంటూ వారి కంపెనీలో కాక పక్క కంపెనీలు కూడా ప్రమాదంలో మారుతున్నాయి. అందుకు ఉదాహరణగా అరబిందో ఫార్మా కంపెనీలో గురువారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది దాదాపుగా 5 ఫైర్ ఇంజన్లు వెళ్లి అదుపు చేసే స్థాయిలో అగ్ని ప్రమాదం జరిగింది. యాజమాన్యం ప్రమాద వివరాలు తెలుసుకునేందుకు వెళ్లిన మీడియాను అనుమతించకుండా కంపెనీ లోనికి ఎవ్వరు రాకూడదంటూ దౌర్జన్యానికి పాల్పడడం గమనార్హం. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలికి వెళ్లి మంటలను అదుపు చేశారు. మీడియాతో కంపెనీ మేనేజ్మెంట్ సిబ్బంది మాట్లాడుతూ పెద్ద ప్రమాదం సంభవించలేదని చిన్న కరెంటు షార్ట్ సర్క్యూట్ అయి కొద్దిపాటి మంటలు చెలరేగి పొగ అలుముకున్నాయని, దాంతో చుట్టుపక్కల వారు కంగారుకు లోనయ్యారని వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చేటప్పటికి మంటలు చాలావరకు అదుపులోకి వచ్చాయంటూ అరకొర సమాచారమిచ్చారు. మీడియాను లోపలికి అనుమతించకపోవడంతో, లోపల ఏం జరుగుతుందోనని అనుమానాలకు తావిస్తోంది. నాయుడుపేట ఎస్సై ఆదిలక్ష్మిని వివరాలు కోరగా మేము వెళ్లేటప్పటికి అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు టెక్నికల్ అధికారులు కంపెనీని పరిశీలిస్తున్నారని వాళ్ల దర్యాప్తు అయ్యాక పూర్తి వివరాలు తెలుస్తాయని తెలిపారు. ఈ ఘటనపై పూర్తి వివరాల కోసం అగ్నిమాపక సిబ్బందిని వివరణ కోరగా నాయుడుపేట ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ ఈరోజు జరిగిన ఘటనలో మా పై అధికారులు గూడూరు ఫైర్ ఆఫీసర్ కి పూర్తి అధికారాలు ఇచ్చారని మేము ఏ వివరాలు తెలియచేయలేమని మీకేదైనా వివరాలు కావాలి అంటే గూడూరు ఫైర్ ఆఫీసర్ ని అడగవలసిందిగా సూచించారు. గూడూరు ఫైర్ ఆఫీసర్ రమణయ్య ను వివరాలు అడిగేందుకు ఫోన్లో పలుమార్లు ప్రయత్నించిన ఆయన స్పందించకపోవడం విశేషం. కంపెనీలో పని చేస్తున్న కొంతమంది కార్మికులు మేము ఏ వివరాలు మీకు కంపెనీలో భారీ ప్రమాదమే జరిగిందని ఇందుకు కంపెనీ యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరి కారణమని ఈ ప్రమాదంలో చాలామంది గాయపడినట్లు వారు తెలియజేశారు. ఈ ఘటనలో అధికారులు నిర్లక్ష్య వైఖరి చూస్తే జరిగిన ప్రమాదంపై మరిన్ని అనుమానాలకు దారితీస్తుంది. సిబ్బంది వారి వివరాలు చెప్పేందుకు భయపడుతూ కంపెనీలో జరిగిన ప్రమాదం గురించి వివరాలు ఎక్కడ మాట్లాడకూడదు అంటూ కంపెనీ యాజమాన్యం మేనేజ్మెంట్ తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారని వివరాలు తెలిపినట్లు తెలిసింది మాకు చాలా ప్రమాదముందని మా వివరాలు ఎక్కడ తెలియజేయవద్దంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పై అధికారులు ఈ కంపెనీ పై దృష్టి పెట్టి ప్రమాదాలకు గల కారణాలను కంపెనీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి కంపెనీ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

యాజమాన్యం భద్రతా చర్యలు చేపట్టాలి : మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

కార్మికుల సంరక్షణకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట టిడిపి ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం సూచించారు. అగ్ని ప్రమాద సమాచారం తెలుసుకున్న ఆయన అరబిందో పరిశ్రమ వద్దకు చేరుకుని ప్లాంట్ హెడ్ సీతారాం, సుదర్శన్ రెడ్డిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఐద్వా రేణిగుంట మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక



అధ్యక్షురాలు భారతి, ప్రధాన కార్యదర్శి ఈశ్వరి

ప్రజాశక్తి - రేణిగుంట: అఖిల భారత ప్రజాస్వామ్య మహిళా సంఘం రేణిగుంట మండల మహాసభ రేణిగుంట జి.యం. వీధిలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఎంపీటీసీ సభ్యురాలు ఎన్.రాజేశ్వరి అధ్యక్షతన బుధవారం జరిగిన ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సాయి లక్ష్మి హాజరైన సందర్భంగా ఐద్వా రేణిగుంట మండల నూతన కమిటీ 17 మందితో ఎన్నిక నిర్వహించారు. ఐద్వా రేణిగుంట మండల అధ్యక్షురాలుగా భారతి, ప్రధాన కార్యదర్శిగా కొండ్రెడ్డి ఈశ్వరమ్మను ఈ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్.రాజేశ్వరి, లక్ష్మి, జాయింట్ సెక్రటరీగా ఎస్. సత్య శ్రీ, శిరీష, ధరణి, కమిటీ సభ్యులుగా సుప్రజ, శాంతి, నూర్జహాన్, అమ్ములు, కుమారి, పద్మావతి, ఎం.లక్ష్మీ, సులోచన, లక్ష్మీ, కో ఆప్షన్ సభ్యురాలుగా ఒక్కరు, మొత్తం 17 మంది ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిందని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి లక్ష్మి బుధవారం నాడు పత్రిక ప్రకటన ద్వారా ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఐద్వా రేణిగుంట మండల అధ్యక్షబి కార్యదర్శులు భారతి, కొండ్రెడ్డి ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. రేణిగుంట మండలంలో మహిళలకు ఏ సమస్య వచ్చినా ఐద్వా మహిళ సంఘం కమిటీ వారికి అండగా నిలబడుతుందని, స్త్రీల సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వంతోనూ.. అధికారులతోనూ రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు.

ముక్కంటి చైర్మన్ పదవిలో ట్విస్ట్

కొట్టే సాయికి దక్కిన పట్టం .. నైరాశ్యంలో ఆశావహులు



డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కొట్టే సాయి (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ పదవి అంశం లో ఎవరూ ఊహించని పరిణామం చోటు చేసుకుంది. హేమాహేమీలు ఈ పదవికి పోటీ పడగా అనూహ్యంగా జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొట్టేసాయిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏటా రూ. 150 కోట్ల వార్షికా దాయం పొందుతున్న హిందూ ధార్మిక ఆలయాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయం టాప్-5లో ఉంది. ఈ కారణంగానే ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పదవి అత్యంత విలువైనదిగా, ఖరీదైనదిగా మారింది. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎంతోమంది ఆశవహులు చైర్మన్ పదవి కోసం ఆశలు పెట్టుకున్నారు. వీరిలో ముఖ్యులుగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ముఖ్య అనుచరుడు రంగినేని చెంచయ్య నాయుడు, డాక్టర్ నైనారు పొన్నారావు, రెడ్డివారి గురవారెడ్డి, గుమ్మడిపూడి దశరథాచారి, పేటా బాలాజీ రెడ్డి, కోటా వినుత, సత్రవాడ మునిరామయ్యలు ఉన్నారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ భార్య విశాలాక్షి పేరు బలంగా వినిపించింది. ఆశావహుల మధ్య నెలకొన్న విపరీతమైన పోటీ కారణంగా కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం గడిచిపోయిన కూడా ట్రస్ట్ బోర్డు నియామకం జరగలేదు. ఎన్ని జరిగినా.. ఎంతమంది ఆశావహులు పోటీలో ఉన్నా.. బొజ్జల ఆశీస్సులు మెండుగా ఉన్న రంగినేని చెంచయ్య నాయుడుకే చైర్మన్ గిరి దక్కుతుందని అంతా భావించారు. కానీ అందరి అంచనాలను తారుమారు చేస్తూ కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. అసలు చైర్మన్ రేసులోనే లేని కొట్టే సాయికి చైర్మన్ పదవిని కట్టబెడుతూ ఆశావహులకు షాకిచ్చింది. కూటమి నిర్ణయంతో శ్రీకాళహస్తిలోని పలువురు కూటమి నేతలు తీవ్ర నైరాశ్యంలో కోరుకుపోయారు. ఇది ఒక రకంగా స్థానిక ఎమ్మెల్యే బొజ్జలను ఇరుకున పెట్టే అంశమే.

తెగువ తెచ్చిన పదవి!

జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొట్టే సాయికి శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పదవి దక్కడం వెనుక ఆయన తెగువ ఉంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో జనసేన పార్టీ తరపున ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల్లో ధైర్యంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న కొట్టే సాయిని అప్పటి సీఐ అంజు యాదవ్ చెంపదెబ్బ కొట్టింది. ఇది పెద్ద ఎత్తున సామాజిక మాధ్యమాల్లోనూ, పత్రికల్లోనూ వచ్చింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దీన్ని తీవ్రంగా పరిగణించి అంజు యాదవ్ ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనే స్వయంగా తిరుపతికి వచ్చి అంజు యాదవ్ పై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సాయి నాటి తెగువే నేడు ముక్కంటి చైర్మన్ గిరిని తెచ్చి పెట్టిందని అందరూ అంటున్నారు.

గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా ఏపీ ముందంజ



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా మారడానికి ఆంధ్రప్రదేశ్ ముందుంజులో ఉందని డి ఆర్ డి ఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి తెలిపారు. సిఐఐ ఆంధ్రప్రదేశ్ తిరుపతిలో 2వ ఎడిషన్ ఇన్నోవేషన్, ఆర్ అండ్ డి కాన్క్లేవ్‌ను గురువారం నిర్వహించారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ మాజీ ఛైర్మన్, బెటర్ కాస్టింగ్స్ సీఈఓ జెఎస్ ఆర్ కె ప్రసాద్ ప్రారంభ వ్యాఖ్యలలో, ఆంధ్రప్రదేశ్ ఏ విధంగా ఏఐని పాలనా చట్రాలలోకి అనుసంధానించడంలో, తెలివైన వ్యవసాయం, ప్రజారోగ్యం, పౌర సేవలు (వాట్సాప్)లలో ఎలా ముందంజలో ఉందో వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని డిఆర్ డిఓ మాజీ ఛైర్మన్, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ గౌరవ సలహాదారు డాక్టర్ సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా వర్చువల్లో మాట్లాడుతూ, భారతదేశాన్ని ప్రపంచంలోని తదుపరి ఆవిష్కరణ కేంద్రంగా మార్చాలని పరిశ్రమ కలలు కనాలని కోరారు. పరిశోధన అండ్ ఆవిష్కరణలకు విషయాలను మార్చే శక్తి ఉందని ఆయన హైలైట్ చేశారు. ప్రపంచానికి అధిక నాణ్యత, ఖర్చుతో కూడుకున్న అత్యాధునిక ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని ఆయన యువతను ప్రోత్సహించారు. మానవ వనరులలో రాష్ట్రం వ్యూహాత్మక బలం దానిని దేశంలో ఆవిష్కరణ, పరిశోధన రంగంలో నాయకుడిగా సహజ నాయకుడిగా మారుస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం కార్యదర్శి భాస్కర్ కాటంనేని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఏఐ అభివృద్ధి సందర్భంలో ప్రభుత్వ విధానాల గురించి వర్చువల్‌గా మాట్లాడారు. వ్యవస్థాపకతను పెంపొందించడం, 20,000 స్టార్టప్‌లను సృష్టించడం, రాబోయే ఐదు సంవత్సరాలలో లక్ష ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా ప్రభుత్వం 2024-2029కి ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీ (4.0)ను ప్రారంభించిందని అన్నారు. ఐఓటీ, ఏఐ, గ్రామీణ ఆవిష్కరణ, సముద్ర షిప్పింగ్, బయోటెక్, వైద్య పరికరాలపై, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి దృష్టి సారించిన రాజమండ్రి, విజయవాడ, వైజాగ్, తిరుపతి, అనంతపురంలోని ఐదు ప్రాంతీయ కేంద్రాల మద్దతుతో అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్థాపనపై ప్రసంగించారు. సిఐఐ సదరన్ రీజియన్ మాజీ ఛైర్మన్, కావిన్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ సికె రంగనాథన్ మాట్లాడుతూ ఇన్నోవేషన్, ఆర్ అండ్ డిలో పెట్టుబడి పెట్టడం ప్రాముఖ్యతను తెలియజేశారు. పేటెంట్ల నుండి ఉత్పత్తుల వరకు ఏఐ పోషించే కీలక పాత్ర గురించి ఆయన వివరించారు. ఇది చర్చలు, పరస్పర చర్యలను స్పష్టం చేస్తుంది, కొత్త ఆలోచనలను నిర్మిస్తుంది, నవీకరించబడిన సమాచారాన్ని అందిస్తుంది. తక్షణ కనెక్షన్‌లను స్థాపించడంలో చాట్ జీపీటీ వంటి సమాచార సాధనాల పాత్ర గురించి తెలియజేశారు. స్కైరూట్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకుడు అండ్ డైరెక్టర్ నాగ భరత్ మాట్లాడుతూ ప్రభుత్వ సంస్కరణలు ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పించడంలో, అంతరిక్ష అన్వేషణను మరింత అందుబాటులోకి తీసుకురావడంలో, పరివర్తన ప్రభావాన్ని తెలియజేశారు. టెలికాం అండ్ తయారీ పరిశ్రమలలో ఆవిష్కరణ అండ్ వ్యూహాన్ని పునర్నిర్వచించడానికి ఏజెంటిక్ ఏఐని ఉపయోగిస్తున్నట్లు ఏఐ నిపుణులు సునీల్ డేవిడ్ తెలిపారు. కస్టమర్ అనుభవం, కార్యాచరణ ఖర్చులను నిర్వహించడం ప్రధాన సవాళ్లు. లభ్యత, సామర్థ్య ప్రణాళికను మెరుగుపరచడానికి ఉత్పత్తి ప్రణాళిక ఏజెంట్లను ఉపయోగించడం ద్వారా ఏజెంటిక్ ఏఐ వీటిని అధిగమించడంలో ఎలా సహాయపడుతుందో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐఐ మాజీ చైర్మన్ రామకృష్ణ, పుష్పిత్ గార్గ్, జగదీష్ మిత్రా, రఘువీరన్ సౌమ్యనారాయణన్, మురళీ చంద్రహాసన్, మలార్ విలి. కె, విజయ్ కర్ణ, వికాస్ నరహరి, దామోదర్ నాయుడు, నంద కుమార్, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీలకు ప్రెసిడెంట్ల నియామకం



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వివిధ స్థానిక ఆలయాలకు, టిటిడి అడ్వైజర్ ప్రెసిడెంట్లను ప్రకటించింది. తిరుమల తిరుపతి దేవస్థానం కి సంబంధించి ఇతర రాష్ట్రాల నుంచి టిటిడి అడ్వైజర్ కమిటీ ప్రెసిడెంట్ లను ప్రకటించింది. వారిలో హైదరాబాద్ జూబ్లీహిల్స్ కి చెందిన ఏ.వి.రెడ్డి ని లోకల్ అడ్వైజరీ కమిటీ ప్రెసిడెంట్ గా నియమించింది. అదే ప్రాంతం హిమాయత్ నగర్ చెందిన నేమూరి శంకర్ గౌడ్, కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన వీరాంజనేయులు, ఢిల్లీకి చెందిన ఎదుగుండ్ల సుమంత్ రెడ్డి, ముంబైకి చెందిన గౌతమ్ సింగానియా, విశాఖపట్నం సంబంధించి వెంకట పట్టాభిరామ్ చోడేలను అడ్వైజర్ కమిటీ చైర్మన్‌లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

12వ పిఆర్‌సి వెంటనే ప్రకటించాలి



ప్రజాశక్తి - సూళ్లూరుపేట : ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్మికులు సూళ్లూరుపేట సిఐటియు ఆఫీసు వద్ద నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలి నిర్వహించి, ధర్నా కార్యక్రమం చేపట్టారు. 12వ పిఆర్సి ప్రకటించాలని, మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డీపల్లి చెంగయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి గత జులై నెలలో సమ్మె కాలపు వేతనం వెంటనే వేయాలని, గత 17 రోజుల సమ్మె కాలంపు ఒప్పందాలు అన్నిటికీ వెంటనే జీవోలు ఇవ్వాలి వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై కమీషనర్ జోక్యం చేసుకుని పరిష్కారించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు చిన్నయ్య, కార్యదర్శి చెంగయ్య, నాయకులు వెంకటరత్నం, రామయ్య, వల్లెమ్మ, చంగమ్మ, గోపాల్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : 12వ పిఆర్‌సి ని వెంటనే అమలు చేయాలని, మున్సిపల్ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని, గురువారం ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ధారా కోటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 23న విజయవాడలో జరగనున్న ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఏ.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వెంకటరమణ, పట్టణ అధ్యక్షులు భూలోక రమేష్, శాంతి వర్ధన్, పద్మమ్మ, నారాయణమ్మ సి.ఐ.టి.యు నాయకులు జోగి శివకుమార్, రమణయ్య గండికోట మధు, అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు వెంకటగిరి పురవీధులలో ఆర్టీసీ బస్టాండ్, త్రిభువని సెంటర్, మున్సిపల్ కార్యాలయం వీది, తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. 12వ పిఆర్సి ప్రకటించాలని, మున్సిపల్ కార్మికుల వివిధ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు
ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



డిమాండ్ నోటీసు పత్రాలను ఆవిష్కరిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పీస్ రేట్ కార్మికులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పీస్ రేట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్, సబ్ స్టేషన్ ఆపరేటర్స్, పీక్ లోడ్, సెక్షన్ ఆపరేటర్లు, ఎటిపి ఆపరేటర్లు, మీటర్ రీడర్లు, స్టోర్స్ లో లోడింగ్, అన్ లోడింగ్ చేస్తున్న హమాలీలు ఇలా వివిధ రకాల పేర్లతో పని చేస్తున్నారన్నారు. వీరందరినీ రెగ్యులర్ చేస్తామని అనేక సంవత్సరాలుగా ప్రభుత్వాలు హామీ ఇస్తున్నా, అమలు చేయటం లేదన్నారు. షిఫ్ట్ ఆపరేటర్లకు రూ.46 వేలు జీతం చెల్లించాలనీ, పెండింగ్ బకాయిలు వెంటనే జమ చేయాలనీ, సంస్థలో విలీనం చేయాలనీ, మీటర్ రీడర్లకు, స్టోర్స్‌లో పనిచేస్తున్న హమాలీలకు పీస్ రేట్ విధానాన్ని రద్దుచేసి నెలవారీ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు ప్రమాదాల గురై మరణిస్తే వారికి ఏ విధమైనటువంటి నష్టపరిహారం యాజమాన్యం చెల్లించటం లేదని వాపోయారు. దీంతో వీరి మీద ఆధారపడిన కుటుంబాలు రోడ్డును పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన, రెగ్యులరైజేషన్ కోసం ఈ నెల 20న తిరుపతి ఎస్ఈ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డిమాండ్ నోటీసు పత్రాలను ఆవిష్కరించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివ ప్రసాద్ రెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, కార్యదర్శి, రవికుమార్, ఆరోగ్యదాసు, రాజా, వినోద్, ధర్మ తదితరులు పాల్గొన్నారు.


పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరాలు



ఉచిత వైద్య శిబిరంలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేయిస్తున్న కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల పరిరక్షణకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమాల్లో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను గురువారం ఉదయం కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాల్లో బిపి, షుగర్, క్యాన్సర్, దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామన్నారు. పది రోజుల పాటు నిర్వహించే ఈ వైద్య శిబిరాల్లో కార్మికులు అందరూ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ వైద్య శిబిరాల్లో డి.ఎం.అండ్ హెచ్.ఓ. బాలకృష్ణ నాయక్, డి.పి.ఎం.ఓ. శ్రీనివాస్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.మధు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించండి : సిపిఎం



సిపిఎం తిరుపతి జిల్లా కమిటీ కార్యదర్శి వందవాసి నాగరాజు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కూటమి ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన 6400 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్సెమెంట్‌ను చెల్లిచాలని సిపిఎం తిరుపతి జిల్లా కమిటీ కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. పీజులు చెల్లించేంతవరకు కళాశాలల యాజమాన్యాలు టీసీలు, మార్క్ లిస్ట్, ఇచ్చేది లేదని ఇబ్బంది పెడుతున్నాయన్నారు. పేద విద్యార్థులు ఫీజులు తల్లిదండ్రుల నుండి తీసుకురాలేని పరిస్థితిలో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. రెండు రోజుల క్రితం యస్వీయులో ఎంఏ పొలిటికల్ సైన్స్ విద్యార్థి వినోద్ కుమార్ ఆవేదనతో అర్ధ నగ్నంగా నిరసన తెలియజేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే చెల్లించాలని, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు జిల్లా కలెక్టర్ వద్ద రాష్ట్ర రాజధానిలో ఆందోళన చేపట్టారన్నారు. ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులను అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమన్నారు. విద్యార్థులు సర్టిఫికెట్స్ లేక, ఉన్నత చదువులకు వెళ్లలేక, ఉద్యోగాల్లో చేరలేక, తల్లిదండ్రులను ఫీజులకు డబ్బులు అడగలేక మానసికంగా ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని వెంటనే సరిదిద్దకపోతే విద్యార్థుల ఆందోళనలకు రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాల్సి వస్తుందని సిపిఎం హెచ్చరిస్తుందని తెలిపారు.

కల్లూరు జమాల్‌కు డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలోని సాహిత్య విభాగం పరిశోధక విద్యార్థి కల్లూరు జమాల్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు సీఈఓ డాక్టర్ సాంబశివమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్య విభాగం ఆచార్యులు ఆచార్య రంగనాథన్ మార్గదర్శకత్వంలో నీతి శాస్త్ర దృష్ట్యా పంచ మహా కావ్య అధ్యయనం" అనే అంశంలో పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం జమాల్ డిఎస్సి 2025లో స్కూల్ అసిస్టెంట్ సంస్కృత అధ్యాపకుడిగా ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

మామిడి సస్యరక్షణపై దృష్టి పెట్టాలి



మామిడి చెట్లు పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారిణి

ప్రజాశక్తి - రామచంద్రాపురం: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులు మామిడి చెట్ల సస్యరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉద్యానవన శాఖ అధికారిణి కోరారు. గురువారం మండలంలోని గంగిరెడ్డి పల్లి, కమ్మ కండ్రిగ, నడవలూరు, రాయలచెరువు, కుప్పం బాదూరు గ్రామాలలో మామిడి చెట్ల సస్య రక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. మామిడి తోటల పరిశీలన అనంతరం ఆమె మాట్లాడుతూ మామిడి పంట కోతానంతరం తోటల లో కొమ్మల కత్తిరింపులు చేపట్టాలని సూచించారు. చీడ పీడల నిర్మూలన, పెస్టిసైడ్స్ వాడకం, భూమి దున్నకం, ఎరువుల వాడకం, యూరియా, ఫాస్పేట్ ఏ పరిమాణంలో వాడాలి, డ్రిప్ పద్ధతిలో నీటి పారుదల మొదలగు అంశాలను రైతులకు తెలిపారు. తగు జాగ్రత్తలు మామిడి తోటల్లో ఇప్పటినుంచే చేపడితే రానున్న సీజన్‌కు మంచి దిగుబడి ఆశించవచ్చని తెలిపారు.


వీఆర్ఏలకు ఉద్యోగోన్నతి కల్పించాలి



తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

ప్రజాశక్తి - రామచంద్రపురం : తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న అర్హులైన వీఆర్ఏలకు గ్రామ రెవెన్యూ అధికారులుగా పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందస్వామి డిమాండ్ చేశారు. గురువారం తహశీల్దార్ మధుసూదన్ రావుకి వీఆర్ఏల ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ సహాయకులు మాట్లాడుతూ పే స్కేలు అమలు, నామినీలను వి.ఆర్.ఏ.లుగా నియమించాలని, అర్హులైన వీఆర్ఏలకు ప్రమోషన్లు, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వి.ఆర్.ఏల సంఘం పిలుపు మేరకు18, 19 తేదీలలో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా, 20న ఆర్.డి.ఓ కార్యాలయాల వద్ద ధర్నా, 22న కలెక్టరేట్ల వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాలకు వీఆర్ఏలు అందరూ హాజరై విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు గోవిందస్వామి కోరారు. ఈ కార్యక్రమంలో ఓ మోహన్, ఎస్ బాలచంద్ర, గీతాలు పాల్గొన్నారు.


బాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి విరాళం



టీటీడీ చైర్మన్‌కు చెక్కు ఇస్తున్న దాతలు

ప్రజాశక్తి - తిరుమల: విజయనగరం పట్టణానికి చెందిన దాత కృష్ణహరీష్ ఈశ్వర్ టీటీడీ శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని ట్రస్టుకు రూ.10,00,116 విరాళం అందజేశారు. చైర్మన్ బీఆర్ నాయుడును తిరుమలలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి, బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి సమక్షంలో డీడీని అందించారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన గూడూరు నాయకులు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గురువారం తాడేపల్లి నివాసంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి కలిశారు. ఆయన వెంట తిరుపతి పార్లమెంట్ యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ మాలె కిషోర్ రెడ్డి, విన్నమాల వెంకట్రామి రెడ్డి, దువ్వూరు సాయి రెడ్డి, దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి, పలగాటి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆపస్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం శ్రీకాళహస్తి మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెనగలూరు రవి, ప్రధాన కార్యదర్శిగా పైడాల మల్లికార్జున్, ఉపాధ్యక్షుడిగా రమేష్, కోశాధికారిగా సంతోష్ కుమార్ నియమితులయ్యారు. ఆపస్ జిల్లా అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి.

భూమనకు మరోసారి పోలీసుల నోటీసులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: విగ్రహం వివాదం ముదురుతోంది.. ఈ కేసులో నాలుగు సెక్షన్ల కింద అలిపిరి పోలీసు స్టేషన్‌లో టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. గురువారం తాజాగా అలిపిరి పోలీసులు మరో నోటీసు ఆయనకు జారీ చేశారు. శనేశ్వర విగ్రహం వివాదంలో శనివారం లోపు స్టేషన్ కొచ్చి వివరణ ఇవ్వాలని కోరారు. శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బ తినే విధంగా అసత్య ప్రచారం చేశారని టిటిడి భూమనపై మండిపడింది. భక్తుల మనోభావాలపై దెబ్బతీసిన ఆయనపైన స్థానిక ఆలయ డిప్యూటీఈవో గోవిందరాజులు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయనపై పోలీసులు చర్యలు తీసుకోబోతున్నారు.

శ్రీకాళహస్తి సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సమస్యలపై గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రస్తావించారు. పాలనా సౌలభ్యం కోసం అర్బన్ కు ఒకరు, రూరల్‌కు ఒకరు తహశీల్దార్లను నియమించాలని కోరారు. యూరియా, డిఏపీ ఇక్కట్ల సమస్యలను ప్రస్తావించారు. లంచ్ బ్రేక్ సమయంలో గుడిమల్లం ఆలయ అభివృద్ధిపై మంత్రి లోకేష్‌తో చర్చించారు.

శ్రీరామలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శ్రీరామ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, తిరుపతికి చెందిన విజయశ్రీ బ్లడ్ సెంటర్ సంయుక్తంగా గురువారం కళాశాల ఆవరణలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా రక్తదానం చాలా గొప్పదన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వాసు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రెండు సార్లు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ అరవింద్ కుమార్ రెడ్డి, బ్లడ్ బ్యాంక్ సెంటర్ నిర్వాహకులు హరికృష్ణ, జాతీయ సేవా విభాగం కో ఆర్డినేటర్లు జి. లక్ష్మీకాంత్, ఎన్.చక్రిధర్, కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీపీ జమ్మళ్ళ శ్రీనివాస్ యాదవ్‌కి సన్మానం

ప్రజాశక్తి -ఏర్పేడు: సిపిఐ నాయకులు గురవయ్య ఆధ్వర్యంలో, ఏర్పేడు ఎంపీపీ జమ్మళ్ళ శ్రీనివాస్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురవయ్య మాట్లాడుతూ పేదల పక్షాన పని చేయాలని ఎంపీపీని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన నాయకులు, సిపిఐ నాయకులు గురవయ్య, లక్ష గోపి, గురునాథం, బాబు, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములపై విచారణ చేపట్టాలి



నిరసన చేపట్టిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో గురువారం పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్లకూరు మండలంలో సుమారు13 వేల ఈ ఎకరాల సీలింగ్ భూములు ఉన్నాయని, నేడు అవి అన్యాక్రాంతమయ్యాయన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా సుమారు 200 కోట్ల రూపాయలు విలువచేసే సీలింగ్ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి కోట్ల రూపాయలు గడిస్తున్నారని ఆరోపించారు. నిజమైన లబ్ధిదారులకు కాకుండా అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అండగా నిలుస్తున్నారన్నారు. పేదల కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సీలింగ్ భూములను సేకరించిందని గుర్తు చేశారు. సీలింగ్ భూముల వ్యవహారంలో అక్రమార్కులకు అండగా నిలిస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. చివరికి 10 కి పైగా గుంట పోరంబోకులుమాయమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ రామకృష్ణయ్య, సర్వేపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ పూల చంద్ర శేఖర్, చిల్లకూరు మండలం ఇంచార్జి, వేమయ, గుంటమడు సుబరామరాజు, గూడూరు మండలం ఇంచార్జి సుబ్బారావు, జిల్లా నాయకులు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు దస్తావేజు లేఖరుల పెన్ డౌన్

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి, దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్స్, కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది శుక్రవారం, శనివారం పెన్ డౌన్ కార్యక్రమంతో నిరసన తెలపనున్నట్లు బాలాజీ జిల్లా అధ్యక్షుడు సీఎం కేశవులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా ప్రవేశపెట్టిన ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటా బేస్ ఆధారంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాలతో దస్తావేజు తయారీ జటిలమవుతూ తీవ్ర జాప్యానికి గురవుతుందని, అందువలన రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజలు, దస్తావేజు లేఖరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నూతన విధానాలలో మార్పు అవసరమని ప్రభుత్వానికి లేఖవ్రాస్తూ, శుక్ర, శనివారం రెండు రోజు రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజులు లేఖర్లు పెన్ డౌన్ కార్యక్రమంతో నిరసన తెలపనున్నట్లు పేర్కొన్నారు.

గ్రామ సచివాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి - బియన్ కండ్రిగ: మండల పరిధిలోని కాటూరు గ్రామపంచాయతీ సచివాలయాన్ని గురువారం ఇన్చార్జ్ ఎంపిడిఓ మోతి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా విద్యార్థులకు ఇప్పటికీ ఆధార్ నమోదు చేయకపోవడంతో సచివాలయ సిబ్బందిపై ఆగ్రహ వ్యక్తం చేశారు. కాటూరు పాఠశాలను పరిశీలించి అక్కడ తాగునీటి సమస్య, విద్యార్థుల వసతులు, ఆహార విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆధార్ క్యాంప్ నిర్వహించి విద్యార్థులకు ఆధార్ కార్డు నమోదు చేయాలన్నారు. అనంతరం ఉపాధి హామీ పనులను ఏపీవో దేవర ఆధ్వర్యంలో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : మండల పరిధిలోని పల్లమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి అథెలిటిక్ క్రీడా పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థిని, విద్యార్థుల సామర్థ్యాలకు ఉపాధ్యాయులు పదును పెట్టాలని సూచించారు. క్రీడల నిర్వహణలో భాగంగా మండల స్థాయి కబడ్డీ వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పాఠశాలల పిఈటిలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

యాప్సి వైస్ చైర్మన్‌గా విజయభాస్కరరావు



ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు భౌతిక శాస్త్ర విభాగంలో సీనియర్ ఆచార్యులుగా పనిచేస్తున్న ఆచార్య ఎస్.విజయభాస్కరరావును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆయన గురువారం యాప్సి కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాలలో బోధనా రంగంలో చక్కటి ప్రణాళికలతో అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, వర్సిటీ ఉన్నతాధికారులతో కలిసి అభివృద్ధి ప్రణాళికలను రచించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తనకు అవకాశమిచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ఆయనను అభినందించారు.

సెట్విన్ సీఈఓ యశ్వంత్‌కి సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా సెట్విన్ సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి.యశ్వంత్‌ను ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వర రావు ఆధ్వర్యంలో గురువారం సెట్విన్ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వెటర్నరీ డాక్టర్‌గా సేవలు అందిస్తున్న, డాక్టర్ యశ్వంత్ సెట్విన్ సీఈవోగా రావడం వెటర్నరీ వృత్తికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ బీసీ ఇంచార్జ్ విజయ్, వెటర్నరీ యూనివర్సిటీ ఇంచార్జ్ ఎజ్రా, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు భార్గవ్ సాయి, పవన్ కుమార్, వెంకటేష్ గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ సేవలపై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఈఎస్ఐ సబ్ రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈఎస్ఐ అందిస్తున్న సేవలు, స్కీమ్ ఫర్ ప్రమోషన్ అఫ్ రిజిస్ట్రేషన్‌అఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయిస్ (ఎస్‌పిఆర్‌ఈఈ)పై గురువారం కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మల్లాది డ్రగ్స్ అండ్ ఫార్మాస్యుటికల్ లిమిటెడ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్సూరెన్స్ కమిషనర్ రేణుక ప్రసాద్, ప్రాంతీయ డైరెక్టర్ రామారావు, జాయింట్ డైరెక్టర్ రాధా కృష్ణలు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి ఈఎస్ఐ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈఎస్ఐ అందిస్తున్న సేవలపై అవగాహన పెంచుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్ పిఆర్ ఈఈ ఉపయోగాలు, ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. కార్మిక రాష్ట్ర భీమా సంస్థ సేవలు, వివరాల కోసం స్థానిక కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎంఓ ప్రదీప్ కుమార్, ఈఈ రవికుమార్, ఈఎస్ఐ తిరుపతి బ్రాంచి మేనేజర్ నాగమణి, ఉద్యోగదారులు, ఉద్యోగులు, కవరింగ్ కాలేని ఉద్యోగదారులు, ట్రేడ్ యూనియన్లు, ఎంఎస్ ఎంఈ యూనిట్లు, ఈఎస్ ఐసి సిబ్బంది పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లే దారిని పరిశీలించిన జెసి



దారిని పరిశీలిస్తున్న జెసి శుభం బన్సల్, అధికారులు

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలోని సవాయి కాలువ రెవెన్యూ గ్రామ లెక్క దాఖలాలో రైతుల పొలాలకు వెళ్లే దారి సమస్యను తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ గురువారం పరిశీలించారు. బ్రాహ్మణ కాలవకు చెందిన రావిళ్ళ విజయ నాయుడు, మరి కొంతమంది రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు దారి లేదని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్, ఆర్‌సి పురం తహశీల్దార్ మధుసూదన్ రావు, సర్వేయర్ తరుణ్, వీఆర్వో నరసింహులులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫిర్యాదుదారుల పొలాలకు వెళ్లేందుకు ముందున్న భూమి సెటిల్మెంట్ భూమిగా సర్వే అధికారులు గుర్తించారు. దీంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయంగా ప్రక్కనున్న కాలువ పరంబోకు స్థలంలో దారి ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని మండల రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. దీంతో రైతులు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, రెవెన్యూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పుణ్యవతికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం అనువాద విభాగం పరిశోధక విద్యార్థి పిల్ల పుణ్యవతికి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సాంబశివమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అనువాద విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ కనకాల కుమార్ మార్గదర్శకత్వంలో "శబ్దరత్నాకరే సంగృహీతానాం అజాదీనాం సంస్కృత తత్సమశబ్దానాం పాణినీయదిశా విశ్లేషణాత్మకమధ్యయనం" అనే అంశంలో పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఈమె పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ లలో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించినట్లు వివరించారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

అసోసియేట్ డీన్ డాక్టర్ గంగరాజుకు సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలోని డైరీ టెక్నాలజీ కళాశాల నూతన అసోసియేట్ డీన్‌గా నియమితులైన డాక్టర్ జి.గంగరాజును వర్సిటీ బోధనేతర సిబ్బంది, నాయకులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ జి. గంగరాజు మాట్లాడుతూ వర్సిటీలోని డైరీ టెక్నాలజీ కళాశాలలోని బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అందరి సహకారంతో డైరీ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి



కమిషనర్ ఫజిలుల్లాకి సిఐటియు అధ్వర్యంలో వినతి పత్రం

ప్రజాశక్తి - నాయుడుపేట: సమ్మె కాలపు ఒప్పందాన్ని అమలు చేయాలని నాయుడుపేట మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె చేయపట్టారు. మున్సిపల్ కార్మికులు సిఐటియు కార్యాలయం నుండి ర్యాలీగా బజారు వీధుల మీదగా మున్సిపల్ కార్యాలయం వద్ద చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి శివకవి ముకుంద మాట్లా డుతూ నాన్ అఫ్ కాస్‌లో ఉన్న కార్మికులు కరోనా కాలంలో కష్టపడి పని చేసినఅధికారులు వారి కష్టాన్ని గుర్తించలేదని అలాంటి కార్మికులకు ఇప్పుడు ఐదు నెలల నుండి వేతనాలు ఇవ్వడం లేదని అడిగితే నాలుగు నెలల వేతనాలు త్వరలోనే వేస్తామని సమాధానమివ్వడం గమనార్హం. కరోనాలో ప్రాణాలుపరంగా పెట్టి పనిచేసిన కార్మికులను ఇప్పుడు అవసరం తీరిపోయాక ఆగిపోమని చెప్పడం బాధాకరమని వారిని పనిలో కొనసాగించాలని లేనిపక్షంలో పోరాటాలు చేపడతామన్నారుఅన్నారు. వారి డిమాండ్స్ తెలియజేస్తూ మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కార్మికులకు సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేయాలని, 12వ పిఆర్సి అమలు చేయాలని, పిఆర్సి జీతాలు చెల్లించాలని, గత సమ్మె కాలపు 17 రోజులు జీతాలు చెల్లించాలి, సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, మరణించి, రిటైర్మెంట్ అయిన వారి స్థానంలో పిల్లలకు ఉద్యోగం ఇవ్వాలి, జీతాలు క్రమం తప్పకుండా ప్రతి నెల ఇవ్వాలని కమిషనర్ ఫజిలుల్లాకి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, కార్యదర్శి ఎస్.కే.కాలేషా మాట్లాడుతూ కార్మికుల కష్టాల్ని అర్థం చేసుకొని కమిషనర్ సేఫ్టీ పరికరాలు రైన్ కోట్లు యూనిఫామ్ ఏర్పాటు చేస్తానని చెప్పడం సంతోషకరమని ఈ సందర్భంగా కమీషనర్‌కు కార్మికుల అందరం ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు నాగరాజు, సురేష్, రమణమ్మ, శ్యామలమ్మ, ఆరావలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

8వ రాష్ట్రీయ పోషణ మాసం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణ పరిధి, మాళవ్య నగర్, అంగన్వాడి కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం గూడూరు ఐసిడిఎస్ అధికారి షేక్ మెహబూబి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సి.డి.పి.వో మెహబూబి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు, స్థూల కాయ నివారణ, చక్కెర, నూనె వినియోగం గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా పౌష్టికాహారంపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ సూపర్ వైజర్ హైమవతి, సిబ్బంది అరుణ తులసి, జ్యోతి, రేణుక, మల్లీశ్వరి, కవిత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గూడూరు, అశోక్ నగర్ సెక్టార్ పరిధిలోని నలజాలమ్మ వీధి, చాకలి పాలెం అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ సూపర్వైజర్ సుజన ఆద్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మన డబ్బులు - మన లెక్కలు' కార్యక్రమంపై అవగాహన

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, ఆరేపల్లె, రంగంపేట మహిళా సమాఖ్య భవనంలో పశు సంవర్ధక, వెలుగు శాఖల సమన్వయంతో మన డబ్బులు-మన లెక్కలు కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘం సభ్యులకు జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ఏ.రవి కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవి కుమార్ మాట్లాడుతూ గతంలో కంటే కూడా ఈ సంవత్సరం అత్యధిక జీవనోపాధికి సంబందించిన యూనిట్లు స్వయం సహాయక సంఘ సభ్యులకు మంజూరయ్యాయని తెలియ జేసారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో గురువారం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. శ్రీ పద్మావతి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి.కుమార్, కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవిలు ఫిజియోథెరపి నేర్చుకొని తద్వారా శిక్షణ పొంది మంచి ఉపాధి అవకాశాలు అందుకోవాలని ఆకాంక్షించారు. బెంగుళూరు మ్యాక్సిమస్ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ డాక్టర్ సద్దాం హుసేన్ మాట్లాడుతూ ఫిజియోథెరపీ శిక్షణ, ఉద్యోగ కల్పనలో భాగంగా మ్యాక్సిమస్ ఫిజియోథెరపి అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ ఉద్యోగాల కోసం మొట్టమొదటిసారిగా తిరుపతి స్విమ్స్‌లో 55 మందిని ఎంపిక చేసి వారిలో 5 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను డైరెక్టర్ చేతులమీదగా అందజేశారు.

మా భూమిని కబ్జా చేస్తున్నారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భూ యజమాని వెంకట సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): జీవకోన ప్రాంతం, తిరుపతి పట్టణ లెక్క దాఖలా సర్వేనెంబర్ 697/3లో ఒకటిన్నర ఎకరం పట్టా భూమి, 697/2లో ఉన్న 15 సెంట్లు స్థలాన్ని నకిలీ పట్టాలు సృష్టించి దౌర్జన్యంగా కోర్టులో స్టేటస్కో ఉందని తెలిపిన కూడా ఇళ్ల నిర్మాణం చేస్తూ కబ్జాకు పాల్పడుతున్నారని భూ యజమాని వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన తండ్రి కృష్ణంరాజు 1977లో కొనుగోలు చేశామని, సదరు స్థలానికి పక్కనే 15 సెంట్లు స్థలం గుంట పరంబోకు ఉండడంతో ఇన్నాళ్లుగా ఆ స్థలాన్ని వ్యవసాయం కోసం 1985 వరకు వినియోగించుకుంటూ వచ్చామని, సదరు స్థలాన్ని తమకు అధికారికంగా అప్ప చెప్పాలని కోరుతూ 1997లో కోర్టు ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. అయితే కోర్టు స్టేటస్కో ఇచ్చిందని, కృష్ణంరాజు మరణానంతరం యాజమాన్య హక్కులు బదిలీ చేసుకొని 15 సెంట్లు స్థలానికి సంబంధించి 2022లో 15361 ద్వారా రాష్ట్ర హైకోర్టు స్టేటస్కో మంజూరు చేసిందన్నారు. అయితే ఇప్పుడు తిరుపతి శాసనసభ్యులు అనుచరులమంటూ విజయ్ కుమార్ అనే వ్యక్తి తన అనుచరులను వెంటబెట్టుకుని దౌర్జన్యంగా కోర్టు స్టేటస్‌లో ఉన్న స్థలంలో ఇంటి నిర్మాణాలు చేపట్టడంతో ఇటు పోలీస్ స్టేషన్లో, అటు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. గతంలో సచివాలయానికి స్టేటస్ లో ఉన్న స్థలాన్ని ఎంపిక చేయడంతో మళ్లీ కోర్టును ఆశ్రయించడంతో కోర్టు నోటీసులతో నగరపాలక సంస్థ అధికారులు వెనక్కి వెళ్లిపోయారన్నారు. ఈ సమావేశంలో వెంకటరమణ పాల్గొన్నారు.

ఇదే స్థలంపై మాకు పట్టా ఇచ్చారు..: జీవకోన తిరుపతి పట్టణ లెక్కదాకా 697/2లో ఉన్న 15 సెంట్లు స్థలంలో 1985లో ఆసియా బి పై మూడు సెంట్లు స్థలాన్ని ప్రభుత్వాలు మంజూరు చేశారని ఆమె కుమారుడు మీర్జాంశా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. తాను చేసిన అప్పుకు బదులుగా ప్రభుత్వం వారు మంజూరు చేసిన పట్టా స్థలాన్ని విజయకుమార్ అనే వ్యక్తికి అగ్రిమెంటు ద్వారా ఇవ్వడం జరిగిందని తెలిపారు. అయితే విలేకరులు అడిగిన ప్రశ్నలకు జవాబు ఇవ్వకుండా మీర్జాంశా సమావేశం నుండి వెళ్లిపోవడం గమనార్హం.

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ప్రజారాజ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా అన్నారు.గురువారం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పురపాలక సిబ్బంది పట్టణంలో స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మున్సిపల్ సిబ్బంది పిచ్చి మొక్కలను చెత్తను తొలగించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి సీఎస్ తేజ సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. అలాగే మార్కెట్ వద్ద రుణమాల కాలవలో పూడితీత పనులు చేపట్టారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో పారిసిద్దని మెరుగుపరిచేందుకు ప్రజల సహకరించాలని కోరారు. ఇళ్ల నుండి వచ్చే చెత్తను ప్రతి ఉదయం వారి ఇంటికి వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు.ప్లాస్టిక్ కవర్లు ఇతర వ్యర్థాలను మురుగు నీటి కాలువల్లో వేయకూడదు అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోగలిగితే ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వ్యక్తి ఆత్మహత్య



మృతుడు సుందర్ రాజ్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగేశ్వర నగర్‌లో ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు తమిళనాడు రాష్ట్రం, కండలూరు చెందిన సుందర్ రాజ్ (32) తిరుపతి అపూర్వ టెక్స్ టైల్స్ బట్టల దుకాణంలో సేల్స్ మాన్‌గా పనిచేస్తున్నాడు. తిరుపతిలో ఓ మహిళతో పరిచయం ఏర్పడి ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం మహిళ ఇంటిలో ఉండగానే బెడ్ రూమ్ లోకి వెళ్లి చీరతో ఉరి వేసుకున్నాడు. స్థానికులు గమనించి తలుపులు పగలగొట్టి ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. మృతుడి బంధువు విజయ్ రాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ప్రజాశక్తి-తిరువతి (మంగళం): శేషాచలం అటవీ పరిధి తిరుపతి జిల్లా కరకంబాడిరోడ్డులోని మంగళం అటవీ ప్రాంతంలో 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ఎస్ఐ టి.విష్ణువర్ధన్ కుమార్, మామండూరు నుంచి కరకంబాడీ ఆటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారన్నారు. గురువారం తెల్లవారు జామున గ్రాండ్ వరల్డ్ వెనుక వైపు కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ కనిపించారని, టాస్క్ ఫోర్స్ బృందం వారిని చుట్టుముట్టడానికి వెళ్లగా వారు తప్పించుకొని పారిపోవడానికి ప్రయత్నం చేశారన్నారు. వారిని వెంబడించిన టాస్క్ ఫోర్స్ పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి నుంచి 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడిన వారిని తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించామన్నారు. దీనిపై టాస్క్ ఫోర్సు ఎస్పై రఫీ కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నారన్నారు.

రామసేతుపై వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణంలోని రామసేతు వంతెనపై గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని(54) స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆ మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు యాచకుడిగా పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాపీ మేస్త్రి ఆత్మహత్య



మృతి చెందిన మద్దిలి సోమేశు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఆడివయ్య కాలనీలో ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ వివరాల మేరకు ఒడిశా రాష్ట్రానికి చెందిన భారంపూర్ కు చెందిన మద్దిలీ సోమేశు (40)గా గుర్తించామన్నారు. మృతుడు తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వంద వసంతాల పండుగ చేద్దాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణంలోని రాజా పానుగంటి బంగారమ్మ సీతారామనాయనిం గారి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వంద వసంతాల వార్షికోత్సవం నిర్వహణపై గురువారం అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. 1921లో స్థాపించిన పాఠశాల వంద వసంతాల వార్షికోత్సవాన్ని కరోనా కారణంగా 2021లో నిర్వహించలేకపోయినట్లు ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య తెలిపారు. ఈఏడాది వార్షికోత్సవం నిర్వహించేందుకు అభిప్రాయ సేకరణ తీసుకుంటున్నట్లు తెలిపారు. తదుపరి సమావేశాన్ని ఈనెల 28న ఆదివారం ఉదయం 10 గంటలకు పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గోపాలకృష్ణ, చిట్టిబాబు, పురుషోత్తం రెడ్డి, కుమార్ మోహన్, నిరంజన్, త్రిమూర్తి, కేశవ, లింకన్, రంగయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మెయింటెనెన్స్ ఇప్పించండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తన భర్త నమ్మించి పెళ్లి చేసుకొని మోసం చేశాడని దీనిపై ఫ్యామిలీ కోర్టును ఆశ్రయిస్తే కోర్టు వారు నెలకు రూ.10 వేల రూపాయలు చొప్పున మెయింటెనెన్స్ డబ్బులు ఇవ్వాలని ఆదేశించినా, తన భర్త ఆదిలింగం కోర్టు ఉత్తర్వులను గౌరవించకుండా మెయింటెనెన్స్ చెల్లించడం లేదని తిరుపతి నగర పరిధిలోని శ్రీనగర్ కాలనీకి చెందిన కృష్ణవేణి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తనకు ఇద్దరు మగ పిల్లలు ఉన్నారని, వారి బాగోగులు చూసుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా కోర్టు వారు స్పందించి మెయింటెనెన్స్ డబ్బులను, మా పుట్టింటి వారిచ్చిన ధనంతో కొన్న స్థలం అమ్మకం చేయడానికి వీలు లేకుండా ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

రక్తహీనతను అధిగమిద్దాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మహిళల్లో రక్త హీనతను అధిగమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపేడు వైద్యాధికారి సుధీర్ కుమార్ సూచించారు. ఎంపేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ సశక్త్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతులకు రక్త పరీక్షలు నిర్వహించారు.

హరిప్రియ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం



ప్రజాశక్తి - యర్రావారి పాలెం: మండల పరిధిలోని బోడేవాండ్లపల్లి గ్రామపంచాయతీలో గురువారం హరిప్రియ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రియ హాస్పిటల్ ఎండి డాక్టర్ ఆదిత్య కుమార్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో 200కి మంది పైగా వైద్యం అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ఝాన్సీ రాణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింగేశ్వరనగర్‌లో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ:మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్విమ్స్ ఆధ్వర్యంలో గురువారం తిరుపతి రూరల్ మండలం, దామినేడు పిహెచ్సీ పరిధిలోని లింగేశ్వర నగర్, రేణిగుంట మండలం, గాజులమండ్యం, శ్రీ సాయి గణేష్ విద్యాలయంలో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారులు డాక్టర్ ఉదయశ్రీ, డాక్టర్ చక్రపాణి తెలిపారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సు ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయి. బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు.

బాలల్లో స్థూలకాయ నివారణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : బాలల్లో స్థూలకాయ నివారణకు నూనె వినియోగం తగ్గించాలని గూడూరు సిడిపివో మెహబూబి పేర్కొన్నారు. గురువారం గూడూరు, గాంధీనగర్ అంగన్వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య దశ సంరక్షణ, విద్య, పోషణతో పాటు చదువు అవసరం అన్నారు. గ్రామీణ శక్తికి మార్గం పోషణకు మార్గమని పేర్కొన్నారు. అనంతరం పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏ.సి.డి.పి.వో శారద, సిబ్బంది సుబ్బమ్మ, వాణి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు ఆధ్వర్యంలో గురువారం "స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తపోటు, చక్కర వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు నియమాలను డాక్టర్లు వివరించారు. పురుషులు ఇళ్లల్లో మహిళల ఆరోగ్యం పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ వరకు మహిళల ఆరోగ్యం పట్ల, వారి అభ్యున్నతి కోసం ప్రతి రోజూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఆసుపత్రి మహిళా స్పెషలిస్ట్ డాక్టర్స్ కె. పద్మావతి, ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్. పద్మహస్త, డాక్టర్ హేమ కుమారి, లే సెక్రటరీ అధికారిణి రాధమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ సి. అమ్ములు, స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్ డాక్టర్. డి. క్రిష్ణ కిషోర్, ఆర్.ఎం.ఓ డాక్టర్ ఏవిఎస్. ప్రసాద్, డాక్టర్ కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ప్రజాశక్తి - నాగలాపురం: మండలంలోని వినోభానగర్‌లో స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ తరపున వైద్యాదికారి విజయ్ కుమార్ అధ్వర్యంలో డాక్టర్ అరుణ్ కిషోర్ మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిభిరం ద్వారా ఈ రోజు శిభిరానికి హాజరైన మహిళలకు షుగర్, రక్తపోటు, రక్తహీనత, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు.

జూనియర్, డిగ్రీ కళాశాలు ఏర్పాటు చేయండి



ప్రజాశక్తి - క్యాంపస్ :తిరుపతిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను స్థాపించాలనీ కాలేజియేట్ కమిషనర్ డా. నారాయణ్ భరత్ గుప్తను ప్రముఖ హైకోర్టు న్యాయవాది, రాష్ట్ర నాయకులు కల్లూరు విష్ణువర్ధన్ రెడ్డి కోరారు. తిరుపతి విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ఇన్ని సంవత్సరాలుగా తిరుపతిలో జూనియర్, డిగ్రీ కళాశాలలు ముఖ్యంగా ప్రభుత్వానికి సంబంధించినవి లేకపోవడం వలన తిరుపతి నియోజకవర్గ పేద విద్యార్థులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులు ప్రభుత్వ విద్యను అందుకోవడం వారికి ఒక అందని ద్రాక్ష లాగా తయారయ్యిందన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని, తిరుపతిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ విద్య లేక పేద వారు వేరే నగరాలకు వెళ్లి చదువు కోవాల్సిన పరిస్థితి నెలకొని ఉందని, ప్రభుత్వ కళాశాలు లేని అదును చూసి కార్పొరేట్, ప్రైవేట్ కాలేజ్ లు, లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ దోచేస్తున్నారని, ఇప్పటికైనా ఈ సమస్యను గుర్తించి ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించి వెంటనే నిర్మాణం చేపట్టి వచ్చే విద్యా సంవత్సరానికి అయినా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేరే విధంగా నిర్ణయం తీసుకోవాలని కొరినట్లు తెలిపారు. వినతి పత్రం ఇచ్చినవారిలో హైకోర్టు న్యాయవాది ఆర్.అభిషేక్ రెడ్డి కూడా ఉన్నారు.

స్వస్థ నారీ శక్తీ పరివార్ అభియాన్ ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: స్వస్థ నారీ స్వ శక్తీ పరివార్ అభయాన్ కార్యక్రమంలో భాగంగా పుత్తూరు మున్సిపాలిటీ, రూరల్ మండలంలోని నేషనూర్ సచివాలయం పరిధిలోనే కార్యక్రమాన్ని గురువారం పుత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో, యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు, తీసుకోవల్సిన పోషకాహారం గురించి అవగాహన కల్పించారు.ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని సూచించారు.

డక్కిలి మండలంలో 69వ స్కూల్ గేమ్స్

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: గురువారం డక్కిలిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల క్రీడా ప్రాంగణంలో ఏడు స్కూల్ పిల్లలతో 69వ మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ జెడ్పిటిసి రామచంద్రన్ నాయుడు, ఎంపీపీ రాజశేఖర్ ఎస్ఎంసి చైర్మన్ వెంకట రమణారెడ్డి, దందోలు పెంచల రెడ్డి, డక్కిలి సునీల్ రెడ్డి, జడ్పీపీహెచ్ఎస్ డక్కిలి హెడ్మాస్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మట్టి నమూనాలపై అవగాహన



ప్రజాశక్తి - యర్రావారిపాలెం:మండలంలోని ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు మట్టి నమూనాపై గురువారం తిరుపతి జిల్లా అధికారి సుధా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మట్టి నమూనాపై సిద్ధాంతపరంగా వివరించి ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు వ్యవ సాయ అనుబంధ అంశాలు గురించి తెలుసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పుష్పాంజలి, సిబ్బంది వేణుగోపాల్, ప్రియాంక, జోష్నా, దీపిక మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సరళ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దాసుకుప్పం బైపాస్, టీపీ కోట రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి - నాగలాపురం: సత్యవేడు నియోజకవర్గం, దాసుకుప్పం బైపాస్ రోడ్డు, నాగలాపురం నుంచి టీపీ కోట రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తన వాణి వినిపించారు. గురువారం తొలిరోజు అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణానికి గతంలో రూ.26 కోట్లు మంజూరు చేసి నాలుగు రోజుల పాటు భూసేకరణ పనులను పర్యవేక్షించానని తెలిపారు. సీఎం, ఆర్ అండ్ బి మంత్రి స్పందించి ఈ రోడ్లు నిర్మాణం సత్వరం చేపట్టాలని సభలో విజ్ఞప్తి చేశారు.

పార్టిసిపేషన్ సర్టిఫికేట్ అందుకున్న సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి -ఏర్పేడు : బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యం ఇటీవల స్టేట్ రిసోర్స్ పర్సనగా ఎంపికయి, అమరావతిలోని విట్ ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ 2025 అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు 3 రోజులు ట్రెనింగ్ పొందిన అనంతరం గురువారం పాఠశాల విద్యా డైరెక్టర్ వెంకట కృష్ణ రెడ్డి చేతుల మీదుగా పార్టిసిపేషన్ సర్టిఫికేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన డీఎస్సీ 2025 అభ్యర్థులకు సెప్టెంబర్ 22 నుంచి 29 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పోషణ్ మాహ్‌పై అవగాహన

ప్రజాశక్తి -కోట : కోట మండలం, నెల్లూరుపల్లి, కొత్తపాలెంలో ఐసిడిఎస్ సిడిపిఓ మునికుమారి ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఐ.కృష్ణమ్మ ఆధ్వర్యంలో గురువారం పోషణ్ మాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మానసికంగా, శారీరకంగా పలు రకాల వికాసాభివృద్ధిని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఐ.కృష్ణమ్మ,సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికే పెరటి కోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-ఏర్పేడు: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఆర్థికంగా అండగా నిలవడానికి, వారి జీవనోపాధిని మెరుగుపరచడానికి 100 యూనిట్ల పెరటి కోళ్ళు పంపిణీ చేయడం జరిగిందని పీడీ శోభన బాబు తెలిపారు. బుధవారం ఏర్పేడు, పాపా నాయుడుపేటలో టిడిపి మండల అధ్యక్షులు పేరం నాగరాజు నాయుడు సమక్షంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోఅడిషనల్ పీడీ ప్రభావతి, ఏపిఎం ఆదినారాయణ, మండల ప్రజా ప్రతినిధులు, సంఘమిత్రలు మరియు సభ్యులు పాల్గొన్నారు.

సశక్త్ పరివార్ అభియాన్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి -ఏర్పేడు : స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ–శక్తిమంతమైన కుటుంబం) కార్యక్రమాన్ని మహిళలు కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఏర్పేడు పిహెచ్సి వైద్యులు డాక్టర్ శివప్రియ, లావణ్యలు సూచించారు. మహిళల ఆరోగ్యం కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని ప్రవేశపెట్టాయని ఆమె పేర్కొన్నారు. మండలంలోని మేర్లపాక గ్రామపంచాయతీలో స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని అధికారులు గురువారం నిర్వహించారు. మహిళలకు వివిధ పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యానికి సూచనలివ్వనున్నట్లు తెలిపారు.

వ్యాపారవేత్తలుగా రాణించాలి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు వెలుగు కార్యాలయంలో ఏపీ ఫుడ్ ప్రోసెసింగ్ సొసైటీ వారు లెమన్ ప్రోసెసింగ్ యూనిట్స్ పై వ్యాపార వేత్తలకులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితులుగా తిరుపతి జిల్లా డిఆర్‌డిఏ పిడిశోభన్ బాబు, ఏపీ ఎఫ్.పిఎస్ మేనేజర్ ఆర్తి, డిఆర్పీలు ఏపీఎంలు, సి.సిలు, సంఘమిత్రాలు పాల్గొన్నారు. అనంతర పి.డి మాట్లడుతూ ఏపీ సీఎం సూచనల మేరకు మహిళలు మంచి వ్యాపార వేత్తలుగా ఎదిగి మరికొంత మందికి ఉపాధి చూపించాలని సూచించారు. అనంతరం ఏ.పి.ఎఫ్.పి.ఎస్ ఆర్తి మాట్లా డుతూ, లెమన్‌ను ఎన్ని రకాలుగా ప్రాసెస్ చేసి, మంచిగా బ్రాండింగ్ చేసి ఎలా అభివృద్ధి చేయాలో వివరించారు.

పంచాయతీ కార్మికులకు పండ్లు, గిఫ్ట్‌లు పంపిణీ



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు గురువారం పండ్లు, గిఫ్ట్‌లు పంపిణీ చేసారు. ప్రధానమంత్రి జన్మదినం సందర్భంగా సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండలాధ్యక్షు కాకి మాను మునిరాజ్ నేతృత్వంలో సేవా పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట ముని, ప్రధాని నరేంద్ర మోడీ జీవిత విశేషాలు తెలిపారు. అనంతరం చంద్రగిరి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు పండ్లు, గిఫ్ట్‌లను సర్పంచ్ రూపారామ్మూర్తి చేతుల మీదుగా అందజేశారు. అదేవిధంగా మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దొరస్వామి, మహిళా మోర్చా నాయకురాలు ప్రశాంతి, బిజెపి నాయకులు పురుషోత్తం రెడ్డి, నరేష్ కుమార్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇందుశేఖర్, టి ఏ ప్రసాద్, శశి కుమార్, కిరణ్ కుమార్, చంద్రకళ, బుజ్జి, పుష్పలత, దొరస్వామి నాయుడు, లక్ష్మయ్య, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన దేశ సంస్కృతి ప్రపంచానికి ఆదర్శం

ప్రజాశక్తి - క్యాంపస్ :మన సంస్కృతి, సంప్రదాయాలలోనే మన దేశ ఔన్నత్యం ఇమిడి ఉందని, అది ప్రపంచ దేశాలకు ఆదర్శమని, వివేకానంద కేంద్ర అఖిలభారత ఉపాధ్యక్షులు హనుమంతరావు పేర్కొన్నారు. యస్వీయు, స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చర్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో సెనేట్ హాల్లో గురువారం 'రోల్ ఆఫ్ కల్చర్ ఇన్ బిల్డింగ్ నేషనలిజం' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద కేంద్ర ప్రతినిధులు రవినాయుడు, చెరుకూరి ప్రసాద్, ఉదయ్ కుమార్, రాజశేఖర్, శరత్ బాబు, లక్ష్మణ్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష



ప్రజాశక్తి - తిరుమల: తిరుమల సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2 వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రిసెప్షన్ విభాగంపై సమీక్షా సమావేశం నిర్వహించారు టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి.బుధవారం (సెప్టెంబర్ 18) తిరుమలలోని అన్నమయ్య భవన్ లో జరిగిన ఈ సమావేశంలో అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు వెంకయ్య చౌదరి. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతి గదుల కేటాయింపునకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే వీఐపీలకు వసతి సౌకర్యంలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా రిసెప్షన్, ప్రోటోకాల్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. విశ్రాంతి గృహాలను పరిశీలించి ఏవైనా మరమ్మతులు ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు వెంకయ్య చౌదరి. ఆలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులు క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశానికి ముందు ఆయన అన్న ప్రసాద విభాగ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను కూడా సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సమావేశంలో సీవీఎస్వో మురళీకృష్ణ, రిసెప్షన్ డిప్యూటీ ఈవో భాస్కర్, వీజీవో సురేంద్ర, ఓఎస్డీ సత్రే నాయక్, అధికారులు పాల్గొన్నారు.

ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ వారోత్సవాలు

ప్రజాశక్తి - రేణిగుంట: రాష్ట్రీయ పోషణ వారోత్సవాలు సెప్టెంబరు నుండి అక్టోబర్ నెల వరకు ప్రతి గ్రామ వార్డు సచివాలయాల్లో నిర్వహించ బడుతుంది అందులో భాగంగా గురువారం గాజుల మన్యం పంచాయతీ , మామన్దురు పంచాయతీ సచివాలయంలో కూడా మండల వైద్య అధికారి చక్రపాణి అక్కడున్న ప్రజలకు మధుమేహం అలాగే క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు మొదలగు వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అలాగే ఐసిడిసి అధికారి అధికారి కృష్ణవేణి పాల్గొని ఐసిడిసి చేయు సేవల గురించి గ్రామస్తులకు వివరించారు. అలాగే అంగన్వాడి వర్కర్స్ పోషకాహారణ స్టాల్స్ ను తయారు చేశారు ఈ కార్యక్రమంలో ఐ సి డి సి ఎస్ సిబ్బంది హేమావతి అనంతలక్ష్మి అంగన్వాడి వర్కర్స్ గంగ రత్న శాంతి శ్రీదేవి మధులత తదితరులు పాల్గొన్నారు.